**ఆమె... చూపుల్లో వెన్నెల సోన జాలువారుతుంది.**
**ఆమె... నవ్వులో మెరుపుతీగ తళుక్కున మెరుస్తుంది.**
**ఆమె... నడక నెమలికి నాట్యం నేర్పుతుంది.**

# వెన్నెలా! ఓ వెన్నెలా!!

సద్దపల్లి ఖుదాబక్ష్



చూడ చక్కని కనుముక్కు తీరుతో ఎత్తుకు తగ్గ లావుతో... నడయాడే నవ మల్లికలా ఆమె కళాశాలలో అడుగు పెడితే చాలు...వందలాది కళ్ళు ఆమె 'అందం' చుట్టూ పరిభ్రమిస్తాయి.

కో-ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో బి.ఏ., థర్డ్ ఇయర్ చదువుతున్న వెన్నెల కంపకింద పూల మొక్కలా సవతి తల్లి మంగతాయారు నీడలో పెరగడంతో ఎప్పుడూ ముభావంగా, మౌనంగా ఉంటుంది.

'ఓయబ్బా!...పెద్ద అందాలరాశినని గర్వం దానికి' అని ఈసడించుకునే వారు తోటి విద్యార్థినులు.

వెన్నెలేమో ఇవేమీ పట్టించుకోకుండా చదువుపై ధ్యాసగా రోజులు దొర్లిస్తోంది.

ఆ రోజు వెన్నెల మనసేమీ బాగులేదు. బలవంతంగా నాలుగు పిరియడ్లు అయ్యాక ఎవరికీ చెప్పకుండా క్లాస్ రూం నుండి బయటికి వచ్చింది. ఇంటికి పోవడానికి మనస్కరించలేదు.

కంప్యూటర్ లాబ్ ప్రక్కనున్న పార్క్ వైపు నడిచింది. పుస్తకాలక్కడ పడేసి పచ్చికపై కూలబడింది.

అక్కడక్కడా పిల్లలు కూర్చుని నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లాడుకుంటున్నారు. గాలి హాయిగా వీస్తోంది. కానీ వెన్నెల ఒంటిని వేడిగా తాకుతోంది.

తలలో నరాలు చిట్లుతున్న అనుభూతి. రాత్రి సంఘటన గుర్తుకురావడంతో ఏడుపు ఆగలేదు. మోకాళ్ళ మధ్య తలుంచి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

తను చేసుకున్న పాపం ఏమిటి?...అందంగా పుట్టడమే తన తప్పా?...ఇల్లు ఓ నరకంలా తయారైంది. కూర్చుంటే తప్పు. లేస్తే తప్పు. తల దువ్వుకుంటే తప్పు. చివరకు సబ్బుతో ముఖం కడుక్కున్నా తప్పే! తనపై పిన్ని ఎందుకిలా కక్ష కట్టింది. ఎన్నాళ్ళీ నరకయాతన? నన్ను రక్షించు ప్రభూ.. అంటూ మనసులోనే కోటి దేవుళ్ళను వేడుకుంది.

చెప్పాపెట్టకుండా బయటికి వెళ్ళిపోయిన వెన్నెలను వెతుక్కుంటూ జలజ వచ్చింది. శోకమూర్తిలా ఒంటరిగా కూర్చుని రోదిస్తున్న వెన్నెలను 'ఏమైందే..వెన్నీ! వొంట్లో బాగాలేదా?' చేతులు పట్టుకుని ఊపుతూ అడిగింది.

## నేర దర్పణం



**ఆర్. ఈశ్వరరెడ్డి I.P.S.**
(ఎస్పీ: ఇంటెలిజెన్స్)

### హిట్ లిస్ట్(HIT LIST: చంపుడు పట్టిక)

చీకటిరాజ్యాన్నేలే నేరస్థుల ముఠాల(mafia gangs) వారి వాడుక భాషలో హిట్‌లిస్టు అంటే హత్య చేయవలసిన వ్యక్తులపట్టిక. తమకు ప్రమాదకరంగా పరిణమించిన వ్యక్తులను తొలగించడానికి నిర్ణయించుకొని రూపొందించుకున్న పట్టిక. ఇతర సందర్భాలలోకూడా ప్రభుత్వాలు మారినప్పుడు, లేదా అత్యవసర పరిస్థితివంటివి ఏర్పడ్డప్పుడు తమకు అనుకూలంకాని లేదా తమ చర్యలకు అవరోధం అనుకున్న వ్యక్తులను పదవినుండి తొలగించడమో(removal from service), వారి ఉద్యోగస్థాయిని తగ్గించడమో(demotion) చేయడానికి నిర్ణయించుకున్న లిస్టు.

అనుదినం సంఘ విద్రోహులు, నేరస్థులు, గూండాలతో పోరాడే పోలీసులు నేరస్థుల ముఠాల హిట్‌లిస్టులలోనూ, తీవ్రవాదుల హిట్‌లిస్టులలోనూ, ఇతర హిట్‌లిస్టులలోనూ ఉన్నారంటే ఆశ్చర్య మేమీ లేదు.

ముఖం పైకెత్తి కళ్ళు చేత్తో తుడుచుకుంటూ 'ఏమీ లేదే. మనసు బాగుండక..' బలవంతంగా నవ్వు పులుముకుంటూ అంది.

'ఇంట్లో మళ్ళీ ఏమైనా గొడవ జరిగిందా?'

'ఏమిటోనే జీవితంపై విరక్తి కలుగుతోంది. ఏంచేయాలో తోచట్లేదే' శూన్యంలోకి చూస్తూ వెన్నెల.

'ఛ...ఏం మాటలే అవి...అసలేం జరిగిందో చెప్పు' అంది అనునయంగా జలజ.

ఇంటర్ నుంచి ఎన్నో క్లిష్ట పరిస్థితులలో ఓదారుస్తూ కొండంత అండగా నిలిచిన జలజకు విషయం చెప్పి హృదయభారాన్ని దించుకోవాలనుకుంది వెన్నెల.

'వెన్నీ! ప్లీజ్ ఏడ్వకే...ఏమైందో చెప్పవే. కంట్రోల్ యువర్‌సెల్ఫ్...ఏమిటే చిన్నపిల్లలాగా....' అంటూ చుబుకాన్ని పైకెత్తి కొంగుతో కళ్ళు వత్తింది జలజ.

ఆప్తురాలి ఒడిలో సేదదీరిన వెన్నెల ఐదు నిముషాల తర్వాత కన్నీటిని తుడుచుకుని రాత్రి జరిగిన సంఘటన కళ్ళకు కట్టినట్టు చెప్పసాగింది.

***

'మా అన్నయ్య భార్య పోయినప్పటి నుంచి పిల్లలను చూసుకోవడం కష్టంగా ఉంది. రెండో పెళ్ళి చేసుకుంటే బాగుంటుందనుకుంటున్నాను అని రాశాడు' అంది పిన్ని భోంచేస్తున్న నాన్నతో.

'చేసుకొమ్మను... ఎవరొద్దన్నారు' అన్నారు నాన్న.

'ఎన్నిసార్లు చెప్పినా మీకెక్కడంలేదు. మా అన్నయ్యకు వెన్నెలనిచ్చి చేద్దామన్నప్పుడల్లా ఏదో చెప్పి తప్పించుకుంటున్నారు. ఈ పెళ్ళి విషయం మీరే అన్నయ్యకు రాయాలి' అంది పిన్ని ఆజ్ఞాపిస్తున్నట్టు. అన్నం తింటున్న నాన్న అగ్రహోదగ్రుడయ్యారు.

'ఏమిటే! ఇంకోసారి ఆమాట అన్నావంటే తోలు వలిచేస్తాను. బంగారంలాంటి బిడ్డను ఆ జులాయి వెధవకు ఇద్దామనడానికి నీకు మనసెలా వచ్చిందే...' అన్నారు ఆవేశంగా.

'మెడ తెగిన కోడిలా ఎందుకలా ఎగిరెగిరి పడతారు. మా అన్నయ్యకు ఏం తక్కువ? శ్రీరామచంద్రుడిలాంటివాడు మీకు జులాయిలా కనిపిస్తున్నాడా?' అంది పిన్ని మరింత గట్టిగా.

'నోర్ముయ్...ఇంకొక్కమాట మాట్లాడావంటే.. ఇన్నాళ్ళూ నువ్వు చెప్పిందానికల్లా గంగిరెద్దులా తలూపాను. నా బిడ్డ విషయంలో మాత్రం కాదు. గుర్తుంచుకో' అన్నారు నాన్న.

'అలాగే.. పెళ్ళీపెటాకులు లేకుండా ఇంట్లో పెట్టుకుని ఊరగాయ వెయ్యండి' అంది పిన్ని.

'ఇల్లు అమ్మైనా, వెన్నెలకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను' రోషంగా అన్నారు నాన్న.

'ఇల్లు కాస్తా అమ్మేసి నాకూ, పిల్లలకు చిప్పిచ్చి చెట్టుకిందకు పంపాలనా. ఆ పప్పులేం ఉడకవ్. తెలుసుకోండి' అంది పిన్ని గొంతు పెంచుతూ.

'ఏమిటే! నీ ఉద్దేశ్యం. మంచిగా చెబుతున్నా నోరుమూసుకు పడుండు'...అన్నారు నాన్న.

దాంతో పిన్ని నాన్న దగ్గరకొచ్చి 'ఏమి చేస్తారు. కొడతారా? అంతకంటే మీ ముఖానికి ఏం చేతనవుతుంది కనుక'.. అంటూ గుడ్లురుముతూ చూసింది.

పక్క గదిలోని నాకు ఆవేశం ముంచుకొచ్చింది. ఇన్నాళ్ళూ రాచిరంపాన పెట్టినా నోరు మెదపని నేను నాన్నను అనరాని మాటలంటుంటే సహించలేకపోయాను. కంట్రోల్ చేసుకోలేక పోయాను...

'అబ్బబ్బా! ఏమిటీ గొడవ... పిన్నీ ఎందుకలా కేకలేస్తావ్. ఎవరన్నా వింటే...' అన్నాను.

'ఏం..తల్లీ! నీకూ కోపం తన్నుకొచ్చిందా. అవున్లే...ఆ తండ్రి బిడ్డవే కదా. నిన్ను 'దేవరెద్దులా' మేపేది ఊళ్ళో ఊరేగించాలని కాదు. ఇది నా ఇల్లు.. చెప్పినట్లు వింటేనే ఇంట్లో ఉంటావ్. లేకుంటే నీ బతుకు బస్టాండే.. జాగ్రత్త'... అంది పిన్ని.

దాంతో నాన్న కోపంగా లేచి పిన్ని రెండు చెంపలూ ఛెళ్ళుమనిపించారు. 'ఛూ...ఈ కొంపలో ఉండేకంటే ఉరేసుకు చావడం నయం' ...అంటూ చరచరా బయటికి వెళ్ళిపోయారు.

'ఈ గొడవలు మామూలే అయినా రాత్రి సంఘటనతో చలించిపోయానే'... అంది వెన్నెల.

'అధైర్య పడకే. అంతా సవ్యంగా జరుగుతుంది. నీ కాళ్ళపై నువ్వు నిలబడే వరకూ మౌనంగా భరించడం తప్ప మార్గం లేదే' అని సలహా ఇచ్చింది జలజ. కాసేపు మౌనం రాజ్యమేలింది.

వెన్నెల మనసు కాస్త తేలికపడింది.

***

రోజులు మునపటిలాగే సాగుతున్నాయి.


తెలుగు లెక్చరర్‌గా జాయిన్ అయిన కిరణ్ క్లాస్‌కు వెళ్ళిన మొదటిరోజే, ముద్దమందారంలాంటి వెన్నెలను చూసి మనసు పారేసుకున్నాడు. ఆమెను ఎలాగైనా తనవైపు తిప్పుకోవాలనుకున్నాడు.

ఫస్ట్ అపాయింట్‌మెంట్ కావడంతో ఫోజు కొట్టకుండా జోకులేస్తూ నవ్వుతూ, నవ్విస్తూ 'మంచివాడు' అనిపించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

అప్పుడప్పుడూ మనుచరిత్ర, భారత, భాగవత, రామాయణాల్లోని మందార మకరందాల్లాంటి పద్యాలను రాగయుక్తంగా పాడి విద్యార్థులను రంజింపచేసేవాడు. క్లాసుకు వస్తూనే క్రిందటి రోజు జరిగిన పాఠానికి సంబంధించి ప్రశ్నలు అడిగేవాడు.

ఎప్పటికప్పుడు ప్రిపేర్ అవుతుండడంతో ఠక్కున జవాబు చెప్పేది వెన్నెల. దాంతో కిరణ్ 'దృష్టి'ని మరింతగా ఆకర్షించింది.

సాహిత్యాభిమానం ఉన్న వెన్నెల... కిరణ్ ప్రతిభాపాటవాలు చూసి అభిమానం పెంచుకుంది. అది గమనించి కిరణ్ ఆమెను 'ముగ్గులోకి' దింపాలని




క్లాస్‌లోనే పొగిడేవాడు. కిరణ్ 'మెప్పు'ను ఆనందంగా స్వీకరించేది వెన్నెల హృదయం.

లెక్చరర్లందరి వద్దకు పోయినట్లుగా తెలుగు డిపార్ట్‌మెంట్‌కూ వెళ్ళి కిరణ్‌తో డౌట్స్ క్లియర్ చేసుకునేది. కిరణ్ వివిధ సాహిత్య పోకడల గురించి మాట్లాడేవాడు. చలం, బుచ్చిబాబు, యండమూరి, మల్లాది...ఇలా ఎందరి గురించో చర్చించుకునేవారు. ఇద్దరి మధ్య 'చనువు' ఎక్కువైంది. కంప్యూటర్, క్లింటన్ పర్యటన, షెల్సీ అందం ... ఇలా ఎన్నో విషయాలు వారి చర్చల్లో.

కిరణ్ వద్ద ఉన్నంతసేపూ పండు వెన్నెల్లో మలయ మారుతం తాకినట్టు మనసంతా మధురానుభూతితో నిండిపోయేది. కిరణ్‌లో అణువణువునా తొణకిసలాడే సంస్కారం, ఆ స్నేహం ఆమెకు గ్రీష్మంలోని తొలకరిజల్లులా ఉండేది. వెన్నెల ఇంత తేలికగా 'వల'లో పడుతుందనుకోని కిరణ్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. మాటలలో ఆమె విషయాలన్నీ చాకచక్యంగా రాబట్టాడు. తన గురించికూడా ఆమె 'తృప్తి' పడేలా చెప్పాడు.

***

హిస్టరీ లెక్చరర్ సెలవు కావడంతో ఆరోజు హిస్టరీ పీరియడ్‌లో అమ్మాయిలందరూ పార్కుకు వెళ్ళారు. వెన్నెల, జలజ, మాలతి, ఎలిజిబెత్ పూలచెట్ల మధ్య కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

సాయంత్రం 4 గంటల గోరువెచ్చని ఎండ చల్లగాలి తోడై పరవశింపచేస్తోంది. అమ్మాయిలు రంగుల సీతాకోకల్లా గుంపులుగా పార్కులో కూర్చున్నారు. గువ్వలు రివ్వురివ్వున ఎగురుతున్నాయి.

'రాజారెడ్డి మంజుల ప్రేమ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోందే' అంది మాలతి.

'ఆదివారంనాడు హార్సిలీ హిల్స్‌కు వెళ్ళి వచ్చారట. ఎవరేమనుకుంటారోనన్న ధ్యాసకూడా లేకుండా మంజుల మరీ బరితెగిస్తోందే' అంది ఎలిజిబెత్.

'బషీర్, ప్రమీల క్లాసులోనే లవ్ లెటర్స్ ఇచ్చిపుచ్చుకుంటున్నారు. కంప్యూటర్ సెంటర్‌కు కలిసే వెళుతున్నారు' చర్చలో పాల్గొంటూ అంది జలజ.

వింటున్న వెన్నెల 'అబ్బబ్బ ఏమి మాటలు.. టాపిక్‌ను మార్చండే' అంది అసహనంగా.

'ఏమ్మా! నీ ప్రస్తావన వస్తుందేమోనని భుజాలు తడుముకుంటున్నావా' అంది నవ్వుతూ మాలతి.

'నా ప్రస్తావనా! పిచ్చిగా మాట్లాడకు' అంది కోపంగా వెన్నెల. ఇంతలో 'ఆ హీరో ఎవరో చెప్పవే' పట్టుబట్టింది ఎలిజిబెత్.

'హీరో లేదు జీరో లేదు నోర్మూయండే' అంది జలజ. చెప్పి తీరాలంది ఎలిజిబెత్.

'తెలుగు లెక్చరర్ కిరణ్, వెన్నెల ప్రేమలో పడ్డారని కాలేజీ మొత్తం కోడై కూస్తుంటే ఏమీ తెలియని బుజ్జిపాపలా మాట్లాడతావేమిటే' అంది మాలతి.

ఈ మాటతో వెన్నెల గుండె లయ తప్పింది. అంతలోనే ఆవేశం ముంచుకొచ్చింది.

'నేనూ, ఆయనా ప్రేమించుకోవడం ఏమిటి?... సరదాగా మాట్లాడినంతనే ప్రేమించుకున్నట్టా?... ఆడా మగా ఇద్దరు మాట్లాడుకుంటే దానికి ప్రేమ రంగు పూసేస్తారు. ఛీ!...ఛీ!...' అంది వెన్నెల.

'పోన్లేవే. నువ్వు ప్రేమించకున్నా విద్యావంతుడు, ఉద్యోగస్తుడు, ఆరడుగుల అందగాడు, పైగా పెళ్ళికాని వాడు నీపై కన్నేశాడు. తప్పేముంది. పచ్చజెండా ఊపెయ్' అంది ఉడికిస్తూ ఎలిజిబెత్.

వెన్నెల మనసు మనసులో లేదు. అంతా గందరగోళంగా ఉంది. చివాలున లేచి బిరబిరా ఇంటివైపు సాగింది. జలజ పిలుపు ఆమె చెవిన పడలేదు.

కిరణ్ తనను ప్రేమిస్తున్నాడా? తనెందుకు కనిపెట్టలేదు. మామూలుగా మాట్లాడుతున్నాడనుకుంది. కిరణ్ అంటే తనలోనూ 'ప్రేమ' ఉందా.. అతనితో మాట్లాడుతుంటే ఎంతో హాయిగా ఉంటుంది. కారణమేమిటి? మోడుబారిన మనసుపై కిరణ్ మాటలు పన్నీటిని చిలకరించినట్టుంటాయి. ఎందుకు? పగిలిన చీమలపుట్టలా ఆలోచనలు సాగుతున్నాయి.

'ఏం తల్లీ తగలడ్డావా? త్వరగా ఇటొచ్చి బట్టలు తికి చావు. నాకు వేరే పని ఉంది.' హుకుం జారీచేసింది మంగతాయారు.

చీర మార్చుకుని బట్టలు ఉతకడానికి సిద్ధమైంది. ఆలోచనలు కిరణ్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

'అవును...కిరణ్‌కు ఏమి తక్కువ. ఎలిజిబెత్ చెప్పినట్లు అందం, చదువు, ఉద్యోగం ఉన్నాయి. అప్పులతో సతమతమయ్యే నాన్న కిరణ్‌లాంటి వ్యక్తిని తనకు భర్తగా తేగలడా? అదృష్టంకొద్దీ అలాంటి వ్యక్తి తారసపడినా అసలే మండిపోతున్న పిన్ని పడనిస్తుందా? తన బతుకు చీకట్లో మగ్గిపోవలసిందేనా? లేదు, అనుక్షణం ఈ ప్రత్యక్షనరకం అనుభవించే ఓపిక తనకికలేదు. బయటపడాలి. అప్పుడే తనకు మనశ్శాంతి ...' ఆలోచనల సుడిగుండంలో గిలగిల కొట్టుకోసాగింది వెన్నెల మనసు.

గాలిపటం లాంటి తన జీవితం మంచి మనసున్న కిరణ్ అండన హాయిగా సాగిపోగలదు. అందుకే కిరణ్ ప్రేమను కాదనకూడదు. ఎవరేమనుకున్నా సరే... నిశ్చయానికి వచ్చింది వెన్నెల.

***

వారం తర్వాత ఇంగ్లీష్ పీరియడ్ ఎగ్గొట్టి తెలుగు డిపార్ట్‌మెంట్‌కెళ్ళింది వెన్నెల. కిరణ్ ఒక్కడే ఏదో ఇంగ్లీష్ నవల చదువుకుంటున్నాడు.

సన్నగా...లయబద్ధంగా...మధురంగా కాలి అందెల సవ్వడి వినిపించడంతో చూసిన కిరణ్... 'హాయ్! ...హౌ ఆర్ యూ?... ఏమిటి దర్శనమే లేదు ...రా ... కూర్చో' నవ్వుతూ ఆహ్వానించాడు.

వెన్నెలవానలా చల్లగా నవ్వింది వెన్నెల.

'వారం రోజుల్నుంచీ చూస్తున్నాను. మాకు లీజర్ ఉన్నప్పుడు మీరు ఏదో క్లాసుకెళ్ళి ఉంటారు. ఇలా లాభం లేదని ఈరోజు ఇంగ్లీష్ క్లాస్ ఎగ్గొట్టి వచ్చాను' అంది కిరణ్ ఎదురుగా కూర్చుంటూ.

'నేనూ నాలుగైదు రోజులనుంచీ ఎదురు చూస్తు

న్నాను. నీకు దయకలిగితే కదా? క్లాసులో మాట్లాడితే బాగుండదని ఊరకే ఉన్నాను'

'ఏమిటి విశేషాలు. చెప్పండి'.. అడిగింది టేబుల్‌పై ఉన్న 'వెన్నెల్లో ఆడపిల్ల' నవల తీసుకుంటూ.

'నీకో విషయం చెప్పాలని ఎన్నో రోజుల్నుంచీ ప్రయత్నిస్తున్నాను... సానుకూలంగా స్పందిస్తావన్న నమ్మకముంది.'.. అన్నాడు ఉపోద్ఘాతంలా.

ఏమిటో పసిగట్టిన వెన్నెల.. 'సంకోచమెందుకు. చెప్పండి' అంది చిరునవ్వులు చిందిస్తూ.

'వెన్నెలా... నాగురించి ఈపాటికి నువ్వు అర్థంచేసుకుని ఉంటావ్... అన్ని విధాలా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను...' అని ఆగాడు.

వింటోంది వెన్నెల. కొన్ని క్షణాల తర్వాత...

'ఐ లవ్ యూ వెన్నెలా. తొలిచూపులోనే నా హృదయాన్ని దోచుకున్నావు. నీ అందాన్నే ప్రేమించడంలేదు. నిన్ను నిన్నుగా ఆరాధిస్తున్నాను. నువ్వు సరేనంటే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను' అన్నాడు పాఠం ఒప్పచెబుతున్న విద్యార్థిలా. హృదయం ఆనందతాండవమాడుతున్నా... మౌనంగా కూర్చుంది వెన్నెల. మౌనం అర్ధాంగీకారంగా భావించిన అతను... 'వెన్నెలా... నా మనసు విప్పాను. నీ అభిప్రాయం చెప్పు. అర్జెంటేమీ లేదు. నా హృదయంలో నీకే చోటుందని గుర్తుంచుకో' అన్నాడు.

ఆమె మనసు వెన్నెలస్నానం చేసినట్లు పరవశించిపోతోంది. బీటలువారిన నెలపై నీటి దార వొలికినట్టు...ఉప్పొంగింది హృదయం. అయినా ...

'మీరంటున్నదేమిటి? నేనంటే ఏమనుకుంటున్నారు. మీరిలా ఆలోచిస్తారని తెలిసి ఉంటే, మాట్లాడేదాన్నే కాదు' అంది తెచ్చిపెట్టుకున్న కోపంతో.

ఆమె మాటలకు కళవళపడిన అతను...

'వెన్నెలా... నీకు బాధ కలిగితే క్షమించు. కానీ ఒక్క విషయం... నువ్వు లేని జీవితాన్ని నేను ఊహించలేను. నా మనసు ముక్కలు చేయకు' అని వేడుకున్నాడు.

'సర్! సంస్కారం, సహృదయం కలిగిన మీ ప్రేమ పొందడం అదృష్టంగా భావిస్తున్నాను. నా హృదయాన్ని మీకు నైవేద్యంగా అర్పించాను' అంది అనిర్వచనీయమైన ఆనందానుభూతితో.

'థ్యాంక్యూ వెన్నెలా...థ్యాంక్యూ వెరీమచ్. రియల్లీ ఐయాం ఎ లక్కీఫెలో' అంటూ ఆమె కుడి చేతివేళ్ళపై పెదవులతో అద్దాడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్న కిరణ్.

వెన్నెల శరీరం సన్నగా ఒణికింది.

'వెన్నెలా! ఈ రోజు ప్రపంచాన్ని జయించినంత సంతోషంగా ఉంది. నీలాంటి గుణవతి, సౌందర్యవతి నా జీవితంలోకి రావడం, నిజంగా పూర్వజన్మ సుకృతం..' అన్నాడు తన్మయం చెందుతూ.

పెనవేసుకున్న మనసులు పరవళ్లుతొక్కుతుండగా పది నిముషాలు కబుర్లు చెప్పుకున్నారు.

'ఇక నేను వెళతాను. చాలా టైమైంది'

'వెన్నెలా...మన ప్రేమ విషయం కొంత కాలం ఎవరికీ తెలియనీయకు. ఓ శుభ సందర్భంలో పెళ్ళి బాంబు పేలుద్దాం' అన్న కిరణ్ మాటలకు ... సరేనని తలూపి తృప్తిగా బయటికొచ్చింది.

***

నెలరోజులు గడిచాయి. ఇద్దరి ముఖాలలో కొత్తకళ. వెన్నెల ప్రవర్తనలో బోలెడు మార్పు. ఇన్నాళ్ళూ అణిగిమణిగి ఉన్న ఆమెలో ఓ రకమైన ఆత్మస్థైర్యం... కిరణ్‌ను తలచుకుని, వరదలో కొట్టుకుపోతున్న గడ్డిపోచను గజ ఈతగాడు ఒడ్డుకు చేరుస్తున్న అనుభూతి పొందసాగింది. అనుక్షణం అతనే కళ్ళలో మెదిలేవాడు. యూనివర్సిటీపని అంటూ అతను తిరుపతికి వెడితే ఒంటరితనాన్ని భరించలేకపోయేది. ముచ్చట్లతో కాలం మంచులా కరిగేది.

000

'వెన్నెలా! మనం దూరంగా వెళ్ళి పెళ్ళిచేసుకుని హాయిగా గడుపుదాం' అన్నాడు ఓరోజు కిరణ్.

'అదేమిటి ఉద్యోగం వదిలి ఏంచేద్దాం? ఒకరినొకరు చూసుకుంటూ గడుపుదామా ఏమిటి?'

'ఇక్కడ కాపురం పెట్టడం నాకిష్టం లేదు. ఇలాంటి బోడి ఉద్యోగం ఎక్కడైనా దొరక్కపోదు.'

వరదలో కొట్టుకుపోతున్న వ్యక్తికి చెట్టుకొమ్మ దొరికినట్టే దొరికి జారిపోతున్నట్టు అనిపించింది.

'నాకేమిటో భయంగా ఉంది కిరణ్! బాగా ఆలోచించు. తొందరపడి నిర్ణయం తీసుకోకు' అంది భుజంపై తలవాల్చి.

***

'మైడియర్ స్వీటీ.. మన కోర్కెలు తీరబోతున్నాయి. మంచిరోజులు రాబోతున్నాయి' అన్నాడు ఆమెను దగ్గరికి లాక్కొని మెడపై ముద్దు పెట్టుకుంటూ.

'ఏమిటి దొరవారీవేళ హుషారుగా ఉన్నారు. విషయం చెప్పండి' అంది దూరంగా జరుగుతూ.

'ముంబాయిలో ఉన్న నా ఫ్రెండ్ గోపాల్‌కు లెటర్ రాశానని నెల క్రితం చెప్పానా'

'ఆ..చెప్పారు. ఏమైందిప్పుడు'

'నాకోసం అక్కడ ఓ జాబ్ చూశాడట. నెలకు 25 వేల జీతం. నాకెలాగూ కంప్యూటర్ ప్రోగ్రామింగ్, వెబ్ డిజైనింగ్ వచ్చుకదా. ఓ మల్టీ నేషనల్ కంపెనీలో చీఫ్ వెబ్ డిజైనర్ ఉద్యోగం. డిపాజిట్ కట్టేందుకు 20 వేలతో వారంలో రమ్మన్నాడు'

'ముంబాయి ఉద్యోగమా!' ఆశ్చర్యం ప్రకటించి.. 'అంతదూరం వెళ్ళటం నాకిష్టం లేదండీ. ఊరుకాని ఊరిలో...ఏమిటో... నాకు భయంగా ఉంది'

'ఒక్క విషయం ఆలోచించు. బంగారంలాంటి అవకాశం.. నేను ఎం.ఏ. చదువుతున్నప్పటి నుంచీ ముంబాయి, ఢిల్లీలాంటి నగరాలకు వెళ్ళాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ కుదరలేదు. లెక్చరర్‌గా పనిచేస్తూనే కంప్యూటర్ కోర్సులు చేశాను. మంచి జీతం, మంచి ఉద్యోగం. వెన్నెలా!...డబ్బులేంది మనిషి ఏమీ చేయలేడు. నాలుగైదేళ్ళుగా ఎదురు చూస్తున్న అవకాశం. దీనికోసమే డబ్బు దాస్తూ వస్తున్నాను. ఆరువేల జీతంతో గానుగెద్దులా బతకడం నాకిష్టంలేదు. అక్కడైతే నెలకు పదిహేనువే



లైనా మిగిల్చొచ్చు...' అని ఆపాడు.

వెన్నెల 'దూరపుకొండలు నునుపంటారు. ఆలోచించి అడుగు వెయ్యడమే మంచిది' అంది.

'ఆలోచించు. ఈరోజు ఇద్దరమే. రేపు మన కుటుంబం పెరుగుతుంది. సరదాలు, షికార్లు, థ్రిల్ లేకుండా గడిపేద్దామంటావా? నా మాట కాదనకు. నీకేమీ కష్టం రానివ్వను.' దిగులుగా ఉన్న ఆమెను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అన్నాడు.

వెన్నెల మనసులో మళ్ళీ కల్లోలం రేగింది. 'ఏమిటి కర్తవ్యం? తన కోసమే బతుకుతున్న తండ్రినీ, ఉన్న ఊరిని వదిలి ఎటో పోవడమా? ...వద్దంటే కిరణ్ వినేట్టులేడు. ఒక వేళ...అతని ఆలోచనకూడా మంచిదేనేమో...డబ్బులేని జీవితంలో సుఖమేముంటుంది. మనవాళ్ళు ఎంతమంది అక్కడ ఉద్యోగాల్లో లేరు.... తనూ వెళుతుంది....'

ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

'ఓ.కె. కిరణ్ నేను రెడీ. నువ్వు కాకులు దూరని కారడవికి రమ్మన్నా హేపీగా వస్తాను. నా సర్వస్వం నువ్వే అయినపుడు నీ మాటే నాకు వేదం' అంది అతనిని మరింతగా హత్తుకుపోతూ.

ఆనందం పట్టలేక వెన్నెలను ముద్దులపై ముద్దులు పెట్టుకున్నాడు.

'నువ్వెంత మంచిదానివి ప్రియా... ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో నువ్వు నాదానివయ్యావు' అని ఆమెను ఎత్తుకుని గాలిలో గిరగిరా తిప్పాడు.

ముద్దుల ముచ్చట్లు తీరిన తర్వాత...

'వెన్నెలా! ఈ విషయాలేవీ ఎవ్వరికీ తెలియనివ్వకు. ఏదైనా సస్పెన్స్ నాకు ఇష్టమని చెప్పా కదా. మనం వచ్చే సోమవారం సాయంత్రం ముంబాయి మెయిల్‌కు వెళ్ళాలి. టికెట్లు రిజర్వ్ చేస్తాను. నువ్వు ఇంట్లోంచి కట్టుబట్టలతో వచ్చెయ్. అన్ని ఏర్పాట్లూ నేను చూసుకుంటాను. ఎవరికీ అనుమానం రాకూడదు. సరేనా' అన్నాడు ఆదేశిస్తున్నట్లు.

సరేనని తలూపి.... 'మరి ఈ ఉద్యోగానికి రిజైన్ చెయ్యాలా?' అడిగింది.

'అయ్యో పిచ్చి... రిజైన్ చేస్తే విషయం అందరికీ తెలియదా. 2 నెలలు సెలవు పెడతాను. తర్వాత పొడిగిద్దాం. లేదంటే అప్పుడు రిజైన్ చేయొచ్చు.'

దాంతో ప్రేమ విషయంలానే ముంబాయి విషయం కూడా జలజకు చెప్పకూడదనుకుంది.

***

సోమవారం రానే వచ్చింది.

ఆ రోజంతా ఇంట్లోనే గడిపింది. పిన్నితో కూడా ప్రేమగా మాట్లాడింది. తమ్ముళ్ళిద్దరికీ బొమ్మలు, చాక్లెట్లు కొనిచ్చింది. బాగా చదువుకోమంది. మధ్యాహ్నం భోంచేసి కునుకు తీస్తున్న తండ్రి పాదాలపై తల ఆన్చి ఆశీర్వదించమని ప్రార్థించింది. ఎంతో సేపు తండ్రి కాళ్ళ వద్దే కూర్చుని బాధాతప్త హృదయంతో కన్నీరు కార్చింది.

ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళొస్తానని చెప్పి భారంగా సాయంత్రం ఇంటి గడప దాటింది వెన్నెల.

***

ముంబాయి రైల్వే స్టేషన్ బయట ఓ తెల్లని మారుతీ కారు... కిరణ్‌ను చూస్తూనే డ్రైవర్ తలుపు తెరిచాడు. ఇద్దరూ అందులో కూర్చున్నారు.

'గోపాల్ చాలా మంచివాడు. ఇక్కడ మన కోసం అన్ని ఏర్పాట్లూ చేశాడు' అన్నాడు వెన్నెల చేయిని తన ఒడిలోకి లాక్కుంటూ కిరణ్.

ఆమాటా ఈమాటా మాట్లాడుతూ చిన్ని చిన్ని సరదాలు తీర్చుకునేలోపల కారు ఓ అందమైన భవంతి ముందు ఆగింది. లాల్చీ, పైజామాలోని 50 ఏళ్ళ వ్యక్తి కారుదిగిన కిరణ్‌ను.. 'నమస్తే సాబ్ ఆయియే' అంటూ లోపలికి ఆహ్వానించాడు.

అటూఇటూ 20 దాకా గదులున్న, వెయిటింగ్ హాలు దాటి ముందుకెళ్ళి లిఫ్ట్‌లో ఫోర్త్ ఫ్లోర్‌కెళ్ళారు. అక్కడ ఓ మూల ఉన్న ఏ.సి. గదిని చూపి 'మీరు రెస్ట్ తీసుకోండి. మీరు వచ్చినట్లు బాస్‌కు ఫోన్ చేస్తానని' హిందీలో చెప్పి వెళ్ళిపోయాడు ఆవ్యక్తి.

పది నిమిషాల తర్వాత ఓ లావుపాటి స్త్రీ కిళ్ళీ నములుతూ లోపలికి వచ్చింది. 'గోపాల్ అమ్మగారు' అంటూ పరిచయం చేశాడు కిరణ్. ...వెన్నెలను కూడా ఆమెకు పరిచయం చేశాడు.

'అదృష్టవంతుడివి చక్కని అమ్మాయిని సెలెక్ట్ చేసుకున్నావ్' అంది కిరణ్ వైపు చూస్తూ. పది నిమిషాలుండి... రిలాక్స్ అవమని వెళ్ళిపోయింది.




'ఈ ప్రక్కనే ఓ ఫ్లాట్‌లో గోపాల్ వాళ్ళుంటారు. ఈ ఫ్లాట్ మొన్ననే ఖాళీ అయితే మన కోసం అట్టే పెట్టారు. ఆ సూట్‌కేస్‌లో నీ బట్టలున్నాయ్. స్నానం చేసి రెడీగా ఉండు. నేను గోపాల్ ఆఫీసుకు వెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడి వస్తాను'... అని ముఖం కడుక్కుని బయటకు వెళ్ళాడు కిరణ్.

ఏ.సి. గదిలో ఫోమ్ బెడ్ మీద వెల్లకిలా పడుకుంది వెన్నెల. మనసు ఊహల్లో తేలిపోతోంది. తనెంత అదృష్టవంతురాలు....అనుకుంటూ ఆనంద పారవశ్యంతో బెడ్‌పై దొర్లింది. బాత్ రూమ్‌కెళ్ళి షవర్ కింద గోరువెచ్చటి నీటితో స్నానం చేసి కనకాంబరం రంగు చీర, మ్యాచింగ్ బ్లౌజ్ తొడుక్కుంది. నిలువెత్తు అద్దంలో తన ప్రతి రూపాన్ని చూసి ఆశ్చర్యపోయింది. మునుపటి వెన్నెలకు...ఇప్పటి వెన్నెలకు...ఎంత మార్పు... తల దువ్వుకుని చక్కగా ముస్తాబైంది.

ఇంతలో బజర్ మోగింది. తియ్యని తలపులతో తలుపు తీసింది. ఎదురుగా స్వీట్ పాకెట్‌తో కిరణ్.

'మై డియర్ స్వీటీ... కొత్త కంపెనీ అగ్రిమెంట్స్ రెడీ అయ్యాయి. రేపే డ్యూటీలో జాయిన్ అవమన్నారు' అంటూ లడ్డూ వెన్నెల నోట్లో కుక్కాడు.

ఇది కలా...నిజమా...అన్నట్లు ఆనందంతో ఉక్కిరిబిక్కిరై కిరణ్‌ను గట్టిగా వాటేసుకుంది. కాసేపు ఇద్దరి మధ్య 'గాలి' గింజుకుంది.

కిరణ్ స్నానం చేసి డ్రెస్ చేసుకుని సోఫాపై కూర్చున్నాడు. తాము అనుభవించబోయే స్వర్గసుఖాలను వర్ణిస్తూ... వెన్నెలను ఊరిస్తూ... అధరామృతాన్ని గ్రోలుతూ ఆనందడోలికల్లో తేలిపోయారు.

వెన్నెల కౌగిలిలోంచి బలవంతంగా లేస్తూ... 'గోపాల్ ఇంటికెళ్ళి పలుకరించి వస్తాను... పండ్లూ పూలతో సాయంత్రం వెళ్దాం... పది నిముషాల్లో వచ్చేస్తాను' అంటూ వెన్నెల పెదవులను తన పెదవులతో పెనవేసి ముద్దిచ్చి బయటకు వెళ్ళాడు.

మెత్తని కుషన్ సోఫాలో తలవెనక్కి వాల్చి అందమైన ఊహల్లో తేలిపోతున్న వెన్నెలకు ప్రయాణ బడలిక వల్ల నిద్ర ముంచుకొచ్చింది. కమ్మని కలలతో వెన్నెల పెదవులపై సన్నని చిరునవ్వు.. ఆమె ఘోరంగా మోసపోయానని, అగాధంలోకి నెట్టివేయబడ్డానని, 'తన' కిరణ్ తనను ఖరీదైన వ్యభిచార గృహానికి అమ్మేశాడని తెలుసుకునే లోపల.....

తిరుపతిలోని మరో ప్రేయసిని తలుచుకుంటూ 50 వేల రూపాయలతో ముంబాయి దాటాడు కిరణ్. ■